క్లుప్తంగా

శివరాత్రి ఏర్పాట్లపై నేడు సమావేశం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై గురువారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్టు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆర్డీఓ బీవీ రమణ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్అండ్బీ, అగ్నిమాపక, పొల్యూషన్ అధికారులు హాజరవుతారని తెలిపారు.

సమస్యలపై సంఘాలు స్పందించాలి



పెయింటింగ్ వర్కర్స్ నూతన కార్యవర్గంతో వీర్రాజు

పెద్దాపురం: సమస్యలపై కార్మిక సంఘాలు స్పందించాలని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజులు, సీఐటీయూ నాయకులు నీలపాల సూరిబాబు, గడిగట్ల సత్తిబాబులు అన్నారు. స్థానిక ముప్పన వారి గాలి బంగ్లాలో బుధవారం పాండవగిరి పెయింటింగ్ అసోసియేషన్ వార్షికోత్సవం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు నీలం శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సంఘాల ఏర్పాటుతో పాటు సంఘం బలోపేతానికి యూనియన్ నాయకులు కృషి చేయాలన్నారు. ముప్పన వీర్రాజును ఘనంగా సత్కరించారు. సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్, వడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పౌర్ణమి పుణ్యస్నానాలకు ఏర్పాట్లు

కొత్తపల్లి: మాఘ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 5న ఉప్పాడ సాగర తీరంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించనున్నారు. కొత్తపల్లి మండలం నుంచే కాకుండా తొండంగి, పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, కత్తిపూడి, ధర్మవరం తదితర గ్రామాల నుంచి సుమారు 50 వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వస్తారు. ఈ మేరకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

జిల్లాలో 2.36 లక్షల మందికి పింఛన్ల పంపిణీ

కాకినాడ సిటీ: జిల్లాలో బుధవారం వైఎస్సార్ పింఛన్ కానుక కింద 2.36 లక్షల మందికి పింఛన్లు అందజేసినట్టు డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి బుధవారం రాత్రి తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి పంపిణీ ప్రారంభించి రాత్రి 8.40 గంటల వరకు 85.87 శాతం అందించారన్నారు. జిల్లాలో 2,75,441 మందికి రూ.75.77 కోట్లు అందజేస్తున్నామన్నారు. మరో నాలుగు రోజుల్లో నూరుశాతం అందించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు పీడీ వివరించారు.

సత్రం భూమి వద్ద హెచ్చరిక బోర్డులు

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలోని సర్వే నెంబర్ 30లో బొగ్గవరం సత్రానికి చెందిన ఎకరం భూమి వద్ద దేవదాయ, ధర్మదాయ శాఖాధికారులు బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ భూముల ఆక్రమణ యత్నంపై ఎమ్మెల్యే కన్నబాబు, అధికారులు సమీక్షించి ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు సత్రం ఈవో శివబాబు, జిల్లా ఎండోమెంట్ అధికారి సూర్యనారాయణ మూర్తి, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఫణి తదితరులు హైకోర్టు విచారణలో వ్యవహారం ఉన్నందున క్రయవిక్రయాలు చెల్లవని, ఎవరైనా ఆక్రమించాలని చూస్తే చట్టప్రకారం శిక్ష అర్హులంటూ బోర్డు ఏర్పాటు చేశారు.

డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణికి సత్కారం

కాకినాడ సిటీ: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పీడీ కె.శ్రీరమణిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖామంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి బి రాజశేకర్, సెర్ప్ సీఈవో అహమ్మద్ ఇంతియాజ్ తదితరుల నుంచి ఘన సన్మానాన్ని అందుకున్నారు. బుధవారం విజయవాడ సెర్ప్ కార్యాలయంలో రాష్ట్ర డీఆర్‌డీఏ పీడీలతో నిర్వహించిన సమీక్షలో ఆమెను సత్కరించారు. మహిళా సంక్షేమ పథకాల అమలులో తమదైన ముద్రను వేసుకున్న శ్రీరమణిని వారు సత్కరించారు.

ప్రతి హిందువు ధర్మరక్షకుడు కావాలి

కరప: సమరసత సేవాఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు రూ.వంద చెల్లించి ధర్మరక్షకుడిగా మారాలని సంస్థ జిల్లా ధర్మప్రచారక్ పడాల రఘు కోరారు. స్థానిక నీలయ్యతోట వీధిలో బుధవారం ఫౌండేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18వ తేదీ వరకు సభ్యత్వ నమోదు చేయడం జరుగుతుందన్నారు. మండల కన్వీనర్ కాదా సత్యానారాయణ, సహ కన్వీనర్ కె.రామకృష్ణ, సన్యాసిరావు, ముమ్మిడి శ్యామ్‌సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

వేయి నామాలవాడు.. విరి భూషణుడు..



సామర్లకోటలో మాండవ్యనారాయణస్వామి గ్రామోత్సవం



సామూహిక పూజల్లో పాల్గొన్న మహిళలు



పూజలు అందుకున్న శ్రీదేవి,భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి

సామర్లకోట: వేట్లపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తొమ్మిది రకాల లక్ష పుష్పాలతో స్వామి, అమ్మవార్లు భక్తకోటికి దర్శనమిచ్చారు. 108 మంది మహిళలు సామూహిక పూజలు చేశారు. శ్రీ, భూ సమేత వేంకటేశ్వర కల్యాణోత్సవాల్లో భాగంగా భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని గోపూజ, స్వామి వారికి అభిషేకాలు చేశారు. లక్ష పుష్పాల పూజ అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కమిటీ నాయకులు గోలి ధర్మరాజు నున్న రామకృష్ణ, వల్లూరి శేఖర్ సేవలందించారు. ఆలయ ప్రధానార్చకుడు సురేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు పూజలు చేశారు.

మాండవ్యనారాయణుని గ్రామోత్సవం

అతిపురాతన మాండవ్యనారాయణస్వామి గ్రామోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో సాగింది. ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని తమ ఇళ్లవద్దే భక్తులు దర్శించుకుని మొక్కుబడులు సమర్పించారు.

పెద్దాపురం: ప్రసన్నాంజనేయ స్వామి, రామాలయాలు, దేవతామూర్తుల ఆలయాల్లో వేకువ జాము నుంచి భజన సంకీర్తనలతో ఏకాహ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కాండ్రకోటలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, నూకామణి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. తాటిపర్తిలోని ప్రసన్నాంజనేయ స్వామి యూత్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షులు గోపు మురళి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ఊరేగింపు, ఏకాహ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. చదలాడ, గుడివాడ గ్రామాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేత్ర పర్వంగా వేంకటేశ్వర కల్యాణం

సామర్లకోట: వేట్లపాలెంలో కొలువైన వేంకటేశ్వరస్వామి కల్యాణం నేత్ర పర్వంగా జరిగింది. సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం అనంతరం ఆలయానికి తిరిగి వచ్చిన తరువాత ప్రత్యేక వేదికపై రాత్రి 9 గంటలకు ఉత్సవ విగ్రహాలను ఉంచి కల్యాణం జరిపించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త మట్టే శ్రీనివాస్ దంపతులు, నున్న రాంబాబు దంపతులు కల్యాణం జరిపించారు. ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కల్యాణాన్ని వి.గోపాలాచార్యులు జరిపించారు.



వేట్లపాలెంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం

వైభవంగా కేశవ పట్టాభి రాముని కల్యాణోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న కేశవ పట్టాభిస్వామి

పెద్దాపురం: కట్టమూరులో కొలువైన కేశవ పట్టాభి రామస్వామి కల్యాణోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్థులు, ఆలయ చైర్మన్ మేడిద వెంకట రామారావు, ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించే కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం లక్ష తులసి పూజ, సాయంత్రం దివ్య కల్యాణం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, చలువ పందిళ్లతో సర్వాంగ అలంకరించారు. ఐదో తేదీన భారీ అన్న సమారాధన, రాత్రి శ్రీపుష్పోత్సవం నిర్వహించనునట్లు వారు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి పింఛను అందజేత



తంగేటి భీమరాజుకు పింఛను అందజేసిన వలంటీరు రాజు

సామర్లకోట: సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా బుధవారం వలంటీర్ దూళ్లపల్లి రాజు కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి ఫించను అందజేశారు. స్థానిక గాంధీనగరానికి చెందిన తంగేటి భీమరాజు అనారోగ్యంతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు వలంటీర్ అక్కడకు వెళ్లి పింఛన్ అందజేశారు.

90 శాతం పింఛన్ల పంపిణీ

కొత్తపల్లి: మండలంలోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు బుధవారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. తెల్లవారుజాము నంచే గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మొదటి రోజు సుమారు 90 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ భాస్కర్‌రావు తెలిపారు. నూరుశాతం పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పింఛన్లు పంపిణీలో వలంటీర్లు నిర్లక్ష్యం వహించినా, అవకతవకలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

పిఠాపురం: రాష్ట్రస్థాయి కీడా పోటీల్లో పిఠాపురం బాదం మాధవరావు బాలికోన్నత ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల హెచ్ఎం నాయుడు వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. జనవరి 29 నుంచి 31 వరకూ కర్నూల్ ఆదర్శ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 బాలికల బాలికల రగ్బీ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినులు భవ్యశ్రీ, కమల, మొహంత స్నీషా, భాను, లావణ్య ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించారన్నారు. గత ఏడు నెలల వ్యవధిలో మూడు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో తూర్పు గోదావరి జిల్లా తరపున పాల్గొని బహుమతులు సాధించారని ఆయన వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు ఎలిఫే సునీల్ దేశాయ్, లోవలక్ష్మి, ఉపాధ్యాయులు డి.శేషు కుమారి, ప్రసూన, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మెడల్స్ సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మరుగు లేక సమస్య



వినియోగంలోనికి రాని మరుగుదొడ్లు

సామర్లకోట: మండల విద్యాశాఖ కార్యాలయంలో మరుగుదొడ్లు లేక సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ కార్యాలయాన్ని సుమారు 15 ఏళ్ల క్రితం అసంతృప్తిగా వదిలేశారు. ఇందులో భాగంగా పురుషులకు, స్త్రీలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు అసంపూర్తిగా ఉన్నాయి. పురుషుల మరుగుదొడ్లకు తలుపులతో పాటు ఫ్లోరింగ్ చేయాల్సి ఉంది. స్త్రీల మరుగుదొడ్లకు కొద్దిపాటి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి తీసుకురావచ్చు. ఆ మరమ్మతులు సుమారు రూ.5 వేలతో అయిపోతాయి. అయినా నిర్లక్ష్యం చేస్తుండడంతో మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి నెల మండల పరిధి ఉపాధ్యాయుల సమావేశం ఈ కార్యాలయంలోనే నిర్వహిస్తారు. ఈ సమయంలో వారు ఈ వసతి లేక తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. కార్యాలయం పరిధిలో కుళాయి పైప్‌లైన్ నుంచి ఒక పైప్‌ను మరుగుదొడ్డిపై ఉన్న ట్యాంకుకు ఇస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుంది.

దాత సహకారంతో ఏర్పాటు చేస్తాం..



కార్యాలయంలో మరుగుదొడ్డికి ఇబ్బంది పడుతున్న విషయం నిజమే. మరుగుదొడ్లకు వాటర్ ట్యాంకు ఏర్పాటు చేయాలి. కొప్పవరానికి చెందిన దాత ట్యాంకు ఇవ్వడానికి అంగీకరించారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం.

– వై.శివరామకృష్ణయ్య, ఎంఈఓ, సామర్లకోట

ఈ విషయం నా దృష్టికి రాలేదు..



ప్రతీ కార్యాలయానికి మరుగుదొడ్డి ఉండాలి. మండల విద్యాశాఖ కార్యాలయంలో మరుగుదొడ్లు అసంపూర్తిగా ఉన్న విషయం నా దృష్టికి రాలేదు. ఎంఈఓ కార్యాలయం నుంచి లెటర్ పెడితే వాటర్ ట్యాంకు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తాం.

– డి శ్రీలలిత, ఎంపీడీఓ, సామర్లకోట

ప్రాధాన్యక్రమంలో ఆలయాల అభివృద్ధి

కరప: నియోజకవర్గ పరిధిలో ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కరపలో గ్రామ దేవత ఉప్పాలమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా వైస్ ఎంపీపీ పాట్నీడి సత్యభీమేశ్వరరావు సోదరులు తమ తల్లిదండ్రులు పాట్నీడి సూర్యకాంతం, శంకరరావుల జ్ఞాపకార్థం నిర్మించిన ఆలయ ముఖద్వారాన్ని ఆయన ప్రారంభించారు. ఆలయాల పరిస్థితిని సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లానని, ఈ పునర్నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. దాతల విరాళాలతో మరింత మెరుగ్గా దీనిని నిర్మించినట్టు తెలిపారు. అమ్మవారి విగ్రహాన్ని, ఆలయాన్ని, ముఖద్వారాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన సంపర శిల్పి దేగల శ్రీరాములు (సాయిబాబు) పనితనాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ముందుగా వైస్ ఎంపీపీ సత్యభీమేశ్వరరావు కుటుంబసభ్యులు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి కుమార్ తదితరుల నడుమ ఈ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం బాలాలయంలోని ఉప్పాలమ్మతల్లిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయకమిటీ సభ్యులు, వివిధగ్రామాల నాయకులు, పాల్గొన్నారు.

పునర్నిర్మించిన ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టకు పూజా కార్యమాలను అంబాజీపేట మండలం మొసలపల్లి వాస్తవ్యుడు బ్రహ్మశ్రీ పి.సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు విరాళంగా ఇచ్చిన 8 గరగలకు పూజలు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, ఈఓ వడ్డాది సత్తిబాబు, కరప సిద్ధాంతి గాధావఝుల కొండయ్య సిద్ధాంతి పాల్గొన్నారు.

చూసిన కనులకు వైభోగం

- కన్నులపండువగా కుంతీమాధవస్వామి కల్యాణం
- వేలాదిగా తరలి వచ్చిన భక్తజనం

పిఠాపురం: ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పిఠాపురంలో పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన శ్రీకుంతీమాధవ స్వామివారి దివ్య కల్యాణం బుధవారం రాత్రి కనుల వైకుంఠంగా జరిగింది. పండితులు ఉదయం పిఠాపురం మహారాజా రాజారావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహుద్దూర్ పేరున స్వామివారికి తొలి అర్చన చేశారు. అనంతరం వేలాది మంది భక్త జనసందోహం నడుమ కుంతీమాధవస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్ల పరిణయం ఆద్యంతం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేశారు. కల్యాణ మండపం వద్ద ఎదురు సన్నాహం నిర్వహించారు. గజవాహనంపై గ్రామోత్సవం అనంతరం పెండ్లికుమారుడైన కుంతీమాధవ స్వామిని పెండ్లి కుమార్తెగా అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, నగలతో అర్చకులు అలంకరించారు. స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకొని వచ్చి రంగురంగుల విద్యుత్ దీపాలు, పువ్వులతో సుందరంగా అలంకరించిన కల్యాణ వేదికపై ఉంచారు. ఆలయ అర్చకులు చక్రవర్తుల నరసింహాచార్యులు, చక్రవర్తుల మాధవాచార్యులు యాజ్ఞీకంలో వేదపండితులు స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వివాహ సమయంలో పుణ్యాహచనం, కంకణధారణ, సుముహూర్తం, కన్యాదానం, మంగళసూత్రధారణ, యజ్ఞోపనీత ధారణ, తలంబ్రాలు, ఆశీర్వచనం తదితర పూజాది కార్యక్రమాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు దంపతులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. వేలాది మంది భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ వరదా శేషు, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



కుంతీమాధవస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్ల పరిణయం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివారి కల్యాణం తిలకిస్తున్న భక్తులు



గొల్లప్రోలులో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కనులపండువగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

పిఠాపురం: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని గొల్లప్రోలులో కొలువైన వేంకటేశ్వరస్వామి రథోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. ఆలయం నుంచి మేళతాళాల నడుమ గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో గ్రామోత్సవం నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ మొగలి అయ్యారావు, పిఠాపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు మొగలి బాబ్జీ, తెడ్లపు చిన్నారావు, కన్వీనర్ల కమిటీ చైర్మన్ మొగలి సాంబశివరావు, సొసైటీ అధ్యక్షుడు జ్యోతుల భీముడు, గొల్లపల్లి చిన్నకొండ, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

కిటకిటలాడిన వైష్ణవాలయాలు

కొత్తపల్లి: భీష్మ ఏకాదశి సందర్భంగా మండలంలో ఉన్న వైష్ణవ ఆలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. గోర్సలో సీతారామస్వామి, కొత్తపల్లిలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, కొండెవరం, ఉప్పాడ, కోనపాపపేట గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి, రమణక్కపేటలో విజయజనార్ధన స్వామి, మూలపేటలోని శ్రీకృష్ణని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం

కలుషిత నీటి నియంత్రణ ఎలా

- గోదావరిలో వ్యర్థ జలాలు
- నేటి సమావేశంలో నిర్ణయం ఏమిటో?



వేట్లపాలెం నుంచి గోదావరి కాలువలోని వస్తున్న మురుగునీరు

సామర్లకోట: గోదావరి కాలువలో కలుస్తున్న వ్యర్థ, కలుషిత జలాలపై అధికారుల చర్యలు శూన్యం. మహాశివరాత్రిని పురస్కరించుకొని గోదావరిలోను, ఆలయ పుష్కరిణిలోను భక్తులు స్నానాలు చేస్తారు. గోదావరి నీటిని పుష్కరిణిలో నింపుతారు. గోదావరి కాలువ వెంబడి ఉన్న జి.మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం గ్రామాల్లో ప్రజలు వాడుక నీరు, మురుగు నీరు ప్రధాన డ్రైన్ల ద్వారా గోదావరిలోకి విడిచి పెడుతున్నారు. మహాశివరాత్రి ఏర్పాట్లపై అధికారులతో జరిగిన సమావేశంలో ఈ కలుషిత జలాల సరఫరా అడ్డుకట్టకు పలు సమావేశాల్లో హామీ ఇచ్చి ఆనక చేతులు దులుపుకొంటున్నారు. శివరాత్రి 10 రోజుల ముందుగా నీరు రాకుండా అడ్డుకట్ట వేయాలని భక్త సంఘం నాయకులు బిక్కిన సాయి, ఆర్వీ సుబ్బరాజు, నూతలపాటి అప్పలకొండలు డిమాండ్ చేస్తున్నారు.

ఆలయాల పరిరక్షణ అందరి బాధ్యత



గోకివాడ రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గ్రామాల్లోని ఆలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మండలం గోకివాడ పల్లపువీధిలో బుధవారం లక్ష్మణ సమేత సీతారాముల విగ్రహాలవిష్కరణలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సాయంతో ప్రభుత్వం రాష్ట్రంలో పురాతన ఆలయాల పరిరక్షణ చేపట్టిందన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో పలు ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హరిబాబు పాల్గొన్నారు.

అలరించిన వేణుగానం



వేణు గానం ఆలపిస్తున్న పూర్ణిమ

పిఠాపురం: స్థానిక అభ్యుదయ కళా వేదికలో బుధవారం అభ్యుదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాదం అప్పారావు భాగవతార్ 107వ జయంత్యోత్సవం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన వీఎస్ఆర్ మూర్తి ఆధ్వర్యంలో బాదం అప్పారావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన పూర్ణిమ ఆలపించిన వేణు గానం సభికులను అమితంగా ఆకట్టుకుంది. అనంతరం టి.తులసి ఆధ్వర్యంలో ప్రదర్శించిన సీతా కల్యాణం హరికథ, టి.తులసి, జయశ్రీ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను కట్టిపడేశాయి. కార్యక్రమంలో వయోలిన్, మృదంగం ఆర్టిస్టులు ఎం.నరసింహమూర్తి, అనిల్, మాదం వెంకట శ్రీరామచంద్రమూర్తి, కృష్ణారావు, వీరభద్రరావు, వెంకటరమణమూర్తి, సూర్యప్రకాష్, హనుమంతరావు, కొండేపూడి శంకర్రావు, నగేష్, గట్టి శ్రీకృష్ణదేవరాయలు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.